నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I | హైదరాబాద్, సోమవారం 22 జూలై 2024 | VIKARABAD

## మూసీ సుందరీకరణపై ప్రశ్నల జోరు

ప్రారంభానికి ముందే పెరిగిన అంచనా వ్యయంపై నెటిజన్ల చర్చ

మూడు నెలల్లో లక్ష కోట్లు పెరగడమేంటని సీఎంను ప్రశ్నిస్తున్న పౌరులు



సిటీబ్యూరో, జూలై 21(నమస్తే తెలంగాణ) : మూసీ సుందరీకరణ అంశం సోషల్ మీడియాలో జోరు చర్చకు దారితీసింది. అధికారంలోకి రాగానే సీఎం రేవంత్ రెడ్డి మూసీని రూ. 50వేల కోట్లతో లండన్‌లోని థేమ్స్ తరహాలో అభివృద్ధి చేస్తామంటూ చెప్పగా.. మూడు నెలల్లోనే అంచనా వ్యయం ఏకంగా రూ. లక్ష కోట్లకు పెరగడం చర్చకు దారితీసింది. శనివారం గోపన్‌పల్లిలో జరిగిన ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవంలో మూసీకి ఐదేండ్లలో రూ. లక్షన్నర కోట్లు ఖర్చుపెట్టి ఊపిరిపోస్తామని సీఎం రేవంత్ రెడ్డి చేసిన మాటలపై నెటిజన్లు ప్రశ్నలు సంధిస్తున్నారు. ఎలాంటి మాస్టర్ ప్లాన్ లేకుండా, ప్రాజెక్టు రిపోర్టులు తయారు కాకుండానే అంచనా వ్యయం పేరిట లక్షల కోట్లకు పెంచేయడమేంటని ప్రశ్నిస్తున్నారు. మూసీ సుందరీకరణపై సోషల్ మీడియాలో పెద్ద చర్చనే జరుగుతుండగా, శాస్త్రీయమైన విధివిధానాలు లేకుండా అంచనా వ్యయం ఎలా పెరుగుతుందని, ప్రభుత్వ లోపభూయిష్ట విధానాలను ఎత్తిచూపుతున్నారు. సోషల్ మీడియా యుగంలో వ్యాఖ్యల వెనుక అసలు మతలబు క్షణాల్లో బట్టబయలు అవుతుంది. తప్పొప్పులను ఎత్తిచూపుతున్నారు. ఇదే విషయంలో ఎక్స్ వేదికగా వివరణాత్మకమైన చర్చలతో అసలు విషయాలను వెలుగులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు ప్రారంభానికి ముందే మూడింతలు పెరిగితే... ఇక ప్రాజెక్టు కార్యారూపంలో వచ్చి పూర్తయ్యే లోపు ఎంత ఖర్చు చేస్తారంటూ వ్యాఖ్యానిస్తున్నారు.

### సీఎం కామెంట్లపై వాట్సాప్ గ్రూపుల్లోనూ చర్చ...

మూసీ సుందరీకరణ చేపట్టాల్సిన ప్రాజెక్టు కానీ కార్యాచరణ, ప్రణాళిక లేకుండా పోతే లక్షల కోట్ల ప్రజాధనం వృథా అవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఈ క్రమంలో శాస్త్రీయ, వాస్తవిక అంశాలను ప్రస్తావించాల్సిన ప్రభుత్వమే ఈ తరహా తాడు, బొంగరం లేని మాటలతో జనాలను అయోమయానికి గురి చేస్తున్నారంటూ నెటిజన్లు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికే సోషల్ మీడియా దాటి ఇంటర్నల్ వాట్సాప్ గ్రూపులోనూ సీఎం చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ అభిప్రాయ సేకరణ చేస్తున్నారు.

తాజాగా, మేడ్చల్ వరకు మెట్రో విస్తరణపై పెదవి విప్పని సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న మాటలను అభిప్రాయ సేకరణ చేస్తుండగా, జనాల జీవన ప్రమాణాలు, మౌలిక, రవాణా సదుపాయాలను మెరుగుపరిచే అభివృద్ధి కార్యక్రమాలను ఆచరణలో పెట్టాలని, ఇలాంటి అభూత కల్పనలతో ప్రజాధనం వృథా అవుతుందని అభిప్రాయపడుతున్నారు. పలు వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియా వేదికలపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యల్లో నిజానిజాలను తేల్చాలంటూ ప్రశ్నలు సంధిస్తున్నారు.

## దొంగలు దొరకరు... కేసు క్లోజ్..!



**సైబర్‌నేరాల్లో పత్తా లేని అసలు నేరస్తులు**

**చేసేది లేక చేతులెత్తేస్తున్న సైబర్ పోలీసులు**

సిటీబ్యూరో, జూలై 21 (నమస్తే తెలంగాణ): సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. అమాయకులను మోసం చేసి..వివిధ రకాలుగా నేరస్తులు కోట్లు దోచేస్తున్నారు. దీంతో రోజుకు పదికిపైగా కేసులు నమోదవుతున్నాయి. అయితే 90 శాతం వరకు అసలు నిందితులు పోలీసులకు చిక్కడం లేదు. విదేశాల్లో ఉంటూ..నేరాలకు పాల్పడుతున్నారనే మాట పోలీసులు చెబుతున్నారు. అసలు నేరస్తులు దొరకడం లేదు.. ఏం చేస్తాం.. కేసు మూసేద్దామంటూ.. పోలీసులు పాత కేసులను క్లోజ్ చేసుకుంటున్నారు.

### ఆధారాలు లభించకపోవడంతో..

బాధితుడు ఇక్కడ ఉండి నేరస్తుడు ఎక్కడో ఉంటూ మోసాలకు పాల్పడుతూ..ఆర్థికంగా సామాన్యులను సైబర్‌నేరగాళ్లు దోచేస్తున్నారు. పోలీసులు నిందితుల సెల్‌ఫోన్, బ్యాంకు ఆధారం ఉంటేనే వాళ్లను పట్టుకోవడం కోసం ప్రయత్నిస్తుంటారు. ఈ ఆధారాలు లేకపోతే ఆ కేసు పక్కన పడిపోతుంది. కొన్ని కేసుల్లో కేవలం బ్యాంకు ఖాతాదారుడిని పట్టుకొచ్చి తాము సైబర్‌నేరాన్ని ఛేదించామని చెప్పుకొంటున్నారు. ఆర్థికపరమైన మోసాలకు సంబంధించిన సైబర్‌నేరాల్లో చాలా వరకు కేసుల్లో అసలు నిందితులు పోలీసులకు చిక్కడం లేదు. విదేశాల్లో ఉంటూ నిందితులు నేరాలకు పాల్పడుతున్నారనే మాట పోలీసులు చెబుతున్నారు. దీనికి తోడు ప్రతిరోజూ ట్రై పోలీస్ కమిషనరేట్లలోని సైబర్ క్రైమ్ ఠాణాల్లో 10కి పైగా కేసులు నమోదవుతున్నాయి.

## రూ.లక్షలోపు రుణమాఫీపై గందరగోళం



- 1,502 మంది రైతు ఖాతాల్లో క్రెడిట్ కాని రుణమాఫీ డబ్బులు
- ఖాతాల్లోని పేర్లు, ఆధార్‌కు మధ్య తేడా కారణంగా అందని మాఫీ
- కుటుంబం యూనిట్‌గా ప్రక్రియ
- మాఫీకి దూరంగా వేలాది మంది రైతులు
- గ్రీవెన్స్‌కు భారీగా ఫిర్యాదులు
- రుణమాఫీ తిరస్కరణకు యాప్‌లో చూపుతున్న కారణాలెన్నో!

**కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రూ. లక్ష లోపు రుణమాఫీపై గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మాఫీకి అర్హత ఉండి జాబితాలో పేరు రాని వారు కొందరైతే.. రుణమాఫీ జాబితాలో పేర్లుండి కూడా.. మాఫీ సొమ్ము ఖాతాల్లో పడని వారు చాలామంది ఉన్నారు. జిల్లాలో 49,741 మంది రైతులకు రూ.278.06 కోట్ల రుణమాఫీని చేసినట్లు ప్రభుత్వం ప్రకటించగా.. ఈ నెల 21వ తేదీ వరకు ఇంకా 1,502 మంది ఖాతాల్లో మాఫీ సొమ్మే జమ కా లేదు. మాఫీ కాకపోవడానికి గల కారణాలను ఏవో, ఏఈవోలు తమ వద్ద ఉన్న యాప్‌లో చూసి చెబుతుండగా..వారు వెల్లడిస్తున్న వివరాలను విని రైతులు అవాక్కవుతున్నారు.**

**- రంగారెడ్డి, జూలై 21 (నమస్తే తెలంగాణ)**



# జాబితాలో పేరున్నా..
# డబ్బులు జమకాలె..

### అంతా అయోమయం..

రుణమాఫీకి సంబంధించి సవాలక్ష ప్రశ్నలు ఎదురవుతున్నాయి. వాటికి స్పష్టమైన సమాధానం చెప్పే వారే కరువయ్యారు. ప్రభుత్వం రూపొందించిన ఉత్తర్వుల మేరకు పట్టా పాసుపుస్తకం ఉన్న ప్రతి రైతుకూ తొలి విడతలో రూ.లక్ష వరకు మాఫీ డబ్బులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కావాలి. కానీ..బ్యాంకులు పంపిన జాబితాలో ఉన్న రైతుల్లో చాలామందికి మాఫీ జమకాకపోవడంపై గందరగోళం నెలకొన్నది. ఇందుకు అధికారులు అనేక కారణాలు చెబుతున్నారు. ఖాతాల్లో పేర్లకు, ఆధార్‌కు మధ్య తేడా కారణంగానే మాఫీ డబ్బులు జమకాలేదని వారు పేర్కొంటున్నారు. రేషన్‌కార్డులో పేరు లేకున్నా రుణమాఫీ డబ్బులు పడడంలేదు. మరోపక్క కొం తమంది రైతుల ఖాతాలకు సంబంధించి ప్రీ ఆడిట్ నిర్వహణకు వ్యవసాయ శాఖ సిద్ధమవుతున్నది. ఆయా ఖాతాలకు సంబంధించిన రైతులు ఎంత మేరకు రుణాలు తీసుకున్నారు?. వడ్డీ ఎంత..? ఎంత చెల్లించారు!. రెన్యువల్ ఖాతాలెన్నీ? రెన్యువల్ తర్వాత బ్యాంకులేమైనా రుణాలిచ్చాయా? తదితర అంశాల వారీగా ప్రీ ఆడిట్‌ను నిర్వహించనున్నారు. ఇలా..పరిశీలించే ఖాతాలకు ఆడిట్ పూర్తయ్యే వరకు నిధులను జమచేయడం లేదు. ఈ కారణంగానూ జాబితాలో పేరున్న రైతుల ఖాతాల్లో మాఫీ డబ్బులు జమకానట్లు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు 48,239 మంది రైతులకు సంబంధించి రూ.250 కోట్ల మేర రుణమాఫీ డబ్బులు మాత్రమే రైతుల ఖాతాల్లో చేరాయి. ఇంకా 1,502 మంది రైతులకు సంబంధించి రూ.28 కోట్లకు పైగా మాఫీ డబ్బులు ఖాతాల్లో జమకావాల్సి ఉన్నది.

### యాప్‌లో చూపుతున్న కారణాలెన్నో..

కుటుంబంలో ఒకరి కన్నా ఎక్కువ మంది పేరిట భూమి ఉన్నా..ఒకే బ్యాంకు ఖాతా ఉండి, రూ.లక్ష లోపే రుణం ఉన్నప్పటికీ రుణమాఫీ జాబితాలో ఆయా రైతుల పేర్లు రాలేదు. ఇంకొన్ని చోట్ల కుటుంబంలో ఒకరి కన్నా.. ఎక్కువ మంది పేరిట రుణం ఉండి, అంతా కలిపి రూ.లక్ష లోపు ఉండగా.. ఒక్కరి పేరుమీద ఉన్న మొత్తం మాత్రమే మాఫీ అయినట్లు తెలుస్తున్నది. ఒకే రైతు వేర్వేరు బ్యాంకుల్లో రుణాలు తీసుకుంటే..ఆ రెండు ఖాతాలను మెర్జ్ చేసి చూస్తున్నారు. రెండింటిలో ఎంత మొ త్తం ఉందో ఆ ప్రకారమే రుణ మాఫీ చేస్తున్నారు. రూ.లక్షకు మించి ఉంటే మాఫీ కావడం లేదు. ఇటువంటి విషయాలకు సంబంధించి రైతులకు సమాచారం ఇచ్చే వారు లేకపోవడంతో బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారు. పీఏసీఎస్, వాణిజ్య, గ్రామీణ బ్యాంకుల్లో రుణాలు పొంది జాబితాలో పేర్లు రాని రైతులు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు.

ఈ క్రమంలో గ్రీవెన్స్‌కు భారీగా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న తరుణంలో.. రెండు రోజుల క్రితమే ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఎవరికైనా మాఫీ కాకుంటే.. ఏవోలు, ఏఈవోల వద్దకు వెళ్లి ఆధార్‌కార్డు సంఖ్య చెబితే వెంటనే దాన్ని యాప్‌లో అప్‌లోడ్ చేసి రైతులకు కారణాలను చెబుతున్నారు. రైతు పేరిట తెల్ల రేషన్ కార్డు లేదని, ఆధార్‌లోని పేరుతో బ్యాంకు ఖాతాలోని పేరు సరిపోవడం లేదని, 2023 డిసెంబర్ 9 నాటికి అసలు కంటే వడ్డీ ఎక్కువగా ఉందన్న కారణాలను పోర్టల్‌లో చూపుతున్నది. కొంతమంది రుణ ఖాతాల సమాచారం పోర్టల్‌లో అందుబాటులో లేదు. ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయ పన్ను చెల్లిస్తుండడం వంటి కారణాల వల్ల రుణమాఫీ జాబితాలో పేర్లు రాలేదని యాప్ వెల్లడిస్తుండడంతో రైతులు అవాక్కవుతున్నారు.









మహేశ్వరం నియోజకవర్గంలోని మక్కల్‌లో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



మక్కల్లో..

# తల్లీ..అందుకో బోనం

**పులకించిన లష్కర్..పోటెత్తిన భక్తజనం ◆ వైభవంగా మహంకాళి బోనాల జాతర**

బేగంపేట, జూలై 21: శివసత్తుల సందడి, పోతరాజుల విన్యాసాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర ఆదివారం వైభవంగా జరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలిరావడంతో లష్కర్‌లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్నది. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 3.30 గంటలకు మంత్రి పొన్నం ప్రభాకర్ అమ్మవారికి తొలిబోనం బోనం సమర్పించారు. ఉదయం 8.30 సీఎం రేవంత్‌రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. దేవాదాయ శాఖ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు కల్పించింది. అమ్మవారిని దర్శించుకునేందుకు సాధారణ భక్తులకు మూడు క్యూలైన్లు, బోనాలు సమర్పించే మహిళలకు రెండు క్యూలైన్లు, వీఐపీ కోసం ఒక క్యూలైన్‌ను ఏర్పాటు చేశారు. జలమండలి భక్తుల కోసం తాగునీటి వసతి కల్పించగా, జాతరను తిలకించేందుకు వివిధ ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఎల్‌ఈడీ తెరలను పెట్టారు. బల్దియా సిబ్బంది, వివిధ విభాగాల వలంటీర్లు క్యూలైన్లలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సహాయ సహకారాలు అందించారు.





అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి

తెల్లవారుజామున తొలి బోనం సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్

నేడు రంగం వేడుకలు..అంబారీపై అమ్మవారి ఊరేగింపు

### గోల్కొండ ఎల్లమ్మకు 5వ బోనం

మెహిదీపట్నం: గోల్కొండ జగదాంబిక అమ్మవారికి ఆదివారం ఐదో బోనం పూజలు జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో గోల్కొండ కోటకు చేరుకొని అమ్మవారికి ఘనంగా బోనం, తొట్టెలు సమర్పించారు.

### ముత్యాలమ్మ ఆలయంలో..

టకారబస్తీలోని ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ నివాసంలో బోనాల వేడుకలు వైభవంగా జరిగాయి. పద్మారావుగౌడ్ స్థానిక ముత్యాలమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బోనాల వేడుకల్లో మాజీ మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, ముఠాగోపాల్, ఎమ్మెల్సీ సురభివాణీదేవి తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా బోనాలు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని పలు గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలతో చూపరులను కనువిందు చేసింది. మహిళలు బోనమెత్తుకుని అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల ఉత్సవాల్లో చిన్నాపెద్దలు సంతోషంగా గడిపారు.

